అకాల వర్షం అపార నష్టం



కోరాడలో కుళ్లిపోయిన టమాటాలను చూపిస్తున్న రైతులు

అకాల వర్షం అన్నదాతను నిలువునా ముంచేసింది. ఓ వైపు వరిపొలాలకు తీరని నష్టం వాటిల్లగా మరోవైపు మొక్కజొన్న రైతుల పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది. చోడి ఆకు కుళ్లిపోగా.. కూరగాయల పంటలూ దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- వర్షపు నీరు నిలిచిపోవడంతో మొలకెత్తని మొక్కజొన్న
- కుళ్లిపోయిన చోడి ఆకు
- దెబ్బ తిన్న కూరగాయల పంటలు
- పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరే..
- నష్టపరిహారం కోసం రైతుల నిరీక్షణ

పద్మనాభం: మండలంలో ఇటీవల వారం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. పొలంలో నీరు నిల్వ ఉండిపోవడంతో మొక్కజొన్న విత్తనాలు మొలకెత్త లేదు. రాగి(చోడి) ఆకు, కూరగాయల పంటలు దెబ్బ తిన్నాయి. దీంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయారు. మండలంలోని కృష్ణాపురం, మద్ది, విలాస్కాన్‌పాలెం, తునిపాలెం, ఏనుగులపాలెం గ్రామాల్లో సుమారు మూడు వందల ఎకరాల్లో రైతులు ఎంతో కష్టపడి మొక్కజొన్న విత్తనాలు వేశారు. ప్రభుత్వం మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేయకపోవడంతో దూరప్రాంతాలైన విజయనగరం, జామి మండలంలోని అన్నంరాజుపేట వెళ్లి హైబ్రిడ్ రకాలైన బయోసీడ్, డీసీకే వంటి విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చుకుని, వేశారు. ఎకరాకు నాలుగు కిలోల ప్యాకెట్ చొప్పున రెండు ప్యాకెట్ల విత్తనాలు వేశారు. ప్యాకెట్ రూ.2200కు కొనుగోలు చేశారు. విత్తనాలకు రూ.4,400 ఖర్చు చేశారు. మొత్తం ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న పంట విత్తనాలు, యూరియా, డీఏపీ కొనుగోలు చేయడానికి, దున్నడానికి, పిక్కలు వేయడానికి రూ.15వేలు పెట్టుబడి పెట్టారు. వేసిన 15 రోజులకే వర్షాలు ప్రారంభమయ్యాయి. దీని వల్ల వర్షపు నీరు ఇప్పటికీ పొలాల్లో నిల్వ ఉండిపోవడంతో మొలకలు రాలేదు. దీనిపై రైతులు ఆశలు వదులుకున్నారు.



కృష్ణాపురంలో వర్షాలకు కుళ్లిపోయిన చోడి ఆకు



రూ.20 వేలు పెట్టుబడి పోయింది

నేను ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట వేశాను. రూ.20వేలు పెట్టుబడి పెట్టాను. వేసిన తరవాత వర్షాలు ఏకధాటిగా కురవడంతో మొలకలు రాలేదు. పొలంలో నీరు నిల్వ ఉండిపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీనివల్ల పెట్టుబడి మొత్తం పోయింది. మళ్లీ విత్తనాలు వేసుకోవాలి. విత్తనాలు కొనాలంటే రూ.20 వేలు ఉండాలి. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– కె.పద్మనాభం, కృష్ణాపురం



కృష్ణాపురంలో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో మొలకలు రాని మొక్కజొన్న పొలం

దెబ్బతిన్న ఉద్యానవన పంటలు

కోరాడ, గెద్దపేట, కృష్ణాపురం, సంగుపేట గ్రామాల్లో వర్షాలకు ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ఈ గ్రామాల్లో టమాటా, ఆనప, చిక్కుడు, బీర వంటి ఉద్యానవన పంటలైన కూరగాయలు వేశారు. రైతులు 20 నుంచి 40 సెంట్ల వరకు విస్తీర్ణంలో వేశారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో ఈ గ్రామాల రైతు కుటుంబాలు జీవనోపాధి పొందుతాయి. వర్షాల వల్ల కూరగాయలు కుళ్లిపోయి ఆర్థికంగా నష్టపోవడంతో వీరి జీవనోపాధికి విఘాతం ఏర్పడింది.

మళ్లీ పంట వేసేందుకు సమాయత్తం

మొక్క జొన్న పంట మళ్లీ వేయడానికి రైతన్నలు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. అధిక శాతం మంది రైతులు ఇంకా విత్తనాలు కొనుగోలు చేయలేదు. వీరు విత్తనాల కోసం విజయనగరం, జామి మండలం అన్నంరాజుపేట పరుగులు తీస్తున్నారు. రాగులు(చోడి) పంట వేయడానికి వేసిన ఆకు వర్షాలకు కుళ్లి పోయింది. ఇది ఉబాలు వేయడానికి పనికి రాకపోవడంతో రైతన్నలు మళ్లీ నారు కోసం విత్తనాలు జల్లడానికి సిద్ధమవుతున్నారు.

కూరగాయలు కుళ్లిపోయాయి



నేను కూరగాయల పంటలు వేశాను. 30 సెంట్లలో బెండ, 30 సెంట్లలో టమాటా, మరో 30 సెంట్లలో బీర విస్తీర్ణంలో వేశాను. ఈ నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఈ పంటలన్నీ దెబ్బ తిన్నాయి. కూరగాయలు కుళ్లిపోవడంతో ఎందుకూ పనికి రాకుండా పోయాయి. వాటిని తీసి బయట పడేశాం. సుమారు రూ.50 వేల వరకు నష్టపోయాను.

– బి.నారాయణప్పుడు, కృష్ణాపురం

మొక్కజొన్న విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలి



నేను 1.8 ఎకరాల్లో వేసిన మొక్కజొన్న విత్తనాలు వర్షం పాలయ్యాయి. మూడున్నర ప్యాకెట్లు కొని వేశాను. సుమారు రూ.23 వేల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షం వల్ల మొక్కలు రాకపోవడంతో పెట్టుబడంతా పోయింది. మళ్లీ విత్తనాలు కొని వేయాలి. విత్తనాలు కొనుగోలు చేయాలంటే తలకు మించిన భారం. ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేసి, ఆదుకోవాలి.

– వి.శ్రీనివాసరావు, ఏనుగులపాలెం

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో టీటీడీ నిర్మించిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున 5.30 గంటల నుండి 6 గంటల వరకు తిరుప్పావై సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవారి సర్వదర్శనాలు కల్పించారు. ఇక్కడికి చేరుకున్న భక్తులు ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు చేశారు. అనంతరం మహాలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి సంకీర్తనలు ఆలపించారు. శ్రీవారి భక్తులు కోలాటాలు నిర్వహించారు. ధనుర్మాసం, సెలవులు కావడంతో శనివారం భక్తుల రద్దీ బాగా పెరిగింది.

నేడు రక్తదాన శిబిరం

తగరపువలస: చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. రక్తదాతలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. వివరాలకు 99856 11355 నంబరులో సంప్రదించాలని కన్వీనర్ జి.సత్యనారాయణ కోరారు.

మొగదారమ్మ సన్నిధిలో ఏపీటీడీసీ చైర్మన్



అమ్మవారిని దర్శించుకున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయాన్ని ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ శనివారం సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భారతీయ సంస్కృతి ఉట్టిపడుతున్న ఆలయ నిర్మాణ శైలిని కొనియాడారు.

ఉత్సాహంగా 'మాస్టర్ చెఫ్'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: స్థానిక శ్రీబాసర లీడ్ స్కూల్‌లో శనివారం మాస్టర్ చెఫ్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, తల్లులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూరీ మిక్చర్, ఫ్రూట్ సలాడ్, శాండ్‌విచ్, బ్రెడ్ కబాబ్, రాగి మాల్ట్, దోసకాయ బోట్ సలాడ్, చాక్లెట్ డోనట్స్, స్ప్రౌట్ సలాడ్ తదితర వంటకాలను సిద్ధం చేశారు. అగ్ని లేకుండా తయారు చేసిన ఈ వంటకాలు చేసిన వారిని శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఎం.భాస్కరరావు, ప్రధానోపాధ్యాయిని రేఖ, కేశవమూర్తి పాల్గొన్నారు.

ఈ నెల 31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ



ఆర్వో శివకుమార్

మధురవాడ: జీవీఎంసీకి 2024–25 రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన ఆస్తిపన్నును డిసెంబర్ 31లోగా చెల్లిస్తే వడ్డీ నుంచి రాయితీ పొందవచ్చని రెవెన్యూ అధికారి శివకుమార్ తెలిపారు. ఇంటి పన్ను, నీటి పన్ను, వీఎల్‌టీ వంటివి అన్ని సచివాలయాలు, జీవీఎంసీ సౌకర్యం కేంద్రాల్లో చెల్లించవచ్చని చెప్పారు. అలాగే ఆన్‌లైన్‌లో సీడీఎంఏ వెబ్‌సైట్ లో visakhapatnam. emunicipal. ap. gov. in ద్వారా కూడా చెల్లించవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలిథిన్ నిషేధంపై విస్తృత ప్రచారం



మధురవాడలో ప్రచారం నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ తదితరులు



అంబేద్కర్ కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న శానిటేషన్ అధికారులు

మధురవాడ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మానవ మనుగడకు ఎంతో ప్రమాదకరమని జీవీఎంసీ 7వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంతోష్ పేర్కొన్నారు. దాని నిషేధానికి అందరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాలలో గల షాపింగ్ మాల్స్, దుకాణాలతో పాటు చిల్లర వ్యాపారులకు శనివారం ఉదయం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ హ్యాండ్ మైక్ ద్వారా సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించడం జరుగుతుందని, వాడిన వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు. కాలుష్య రహిత విశాఖ నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌కి బదులు ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు శారిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ కూడలిలో మానవహారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పాలిథిన్ నిషేధంపై అవగాహన కలిగిస్తూ శానిటేషన్ సిబ్బంది శనివారం అంబేద్కర్ కూడలిలో ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు, సచివాలయ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, వర్తక సంఘం అధ్యక్షుడు చెరుకూరి దేవుళ్లు తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



విపత్తుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

పద్మనాభం: తుపాన్లు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. 16వ బెటాలియన్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) 35 మందితో కూడిన బృందం కార్యక్రమంలో పాల్గొని, జాగ్రత్తలను వివరించింది. తుపాన్లు వచ్చినప్పుడు ఉపయోగించే పరికరాలు.. పాడైపోయిన, నిర్మాణంలో ఉన్న భవనాలు కూలిపోయినప్పుడు వినియోగించే పరికరాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. ఇన్‌చార్జి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి.వైకుంఠం, హెచ్‌ఎం ఆర్.వి.గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎం పాలెం ట్రాఫిక్ పీఎస్‌లో 36 వేల కేసులు

- 2024లో ఇప్పటి వరకు నమోదు
- రూ.80.89లక్షల అపరాధ రుసుము వసూలు

పీఎం పాలెం: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 సంవత్సరానికి గాను ఇంతవరకు 36వేల 564 కేసులు నమోదు కాగా, రూ.80లక్షల 89వేల 100 జరిమానాగా లభించిందని విశాఖ నార్త్ డివిజన్ ట్రాఫిక్ సీఐ సాయి తెలిపారు. నమోదైన కేసులలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన 17వందల 32 మంది పై కేసులు నమోదు చేయగా, న్యాయస్థానం వారికి రూ.58లక్షల రెండువేల 500 జరిమానా విధించిందన్నారు. వారిలో 9 మందికి జైలు శిక్ష విధించారని తెలిపారు. హెల్మెట్ ధరించని వారిపై 25వేల 933 కేసులు, సీటు బెల్టులు ధరించని వారిపై 108, మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి 210, రాంగ్ పార్కింగ్‌పై 3820, సెల్‌ఫోన్ కేసులు 195, ట్రిపుల్ రైడింగ్ కేసులు 740తో పాటు ఇతర కేసులు 3వేల 826 నమోదయ్యాయని తెలియజేశారు. వారి నుంచి మొత్తం రూ.80 లక్షల 89 వేల 100 జరిమానాగా వసూలు చేశామని సీఐ తెలిపారు.

యోగా పోటీల్లో కళాధరరావుకు గోల్డ్ మెడల్



సర్టిఫికెట్ అందుకుంటున్న కళాధరరావు

మధురవాడ:యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రుషికొండ సాయిప్రియ బీచ్ రిసార్ట్‌లో వరల్డ్ యోగా కప్–3.0 పేరుతో యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్–2024 పోటీలను శనివారం నిర్వహించారు. ఇందులో మధురవాడకు చెందిన యోగా గురువు కేవీకే కళాధరరావు 56–60 ఏళ్ల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఆయన అతిథుల చేతుల మీదుగా కప్, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ పోటీలకు దేశ, విదేశాల నుంచి సుమారు 600 మంది హాజరయ్యారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఏక్యూజే విద్యార్థి



గణేష్‌కు రూ.10వేలు అందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ ఫారుఖీ

తగరపువలస: రిపబ్లిక్ డే వేడుకలలో భాగంగా 2025 జనవరి 26న ఢిల్లీలో జరిగే కవాతుకు ఆనందపురం మండలం గుడిలోవ ఏక్యూజే కళాశాలకు చెందిన ఎంసీఏ రెండో సంవత్సరం విద్యార్థి యు.గణేష్ ఎంపికయ్యాడు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం తరపున గణేష్‌కు ఈ అవకాశం లభించింది. ఈ సందర్భంగా గణేష్‌ను అభినందిస్తూ కళాశాల కరస్పాండెంట్ ఐహెచ్ ఫారుఖీ శనివారం ప్రోత్సాహకంగా రూ.10వేల నగదు అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ పీవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్వారీ లీజుపై ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో సుధాసాగర్



స్థానికుల తరపున వాదన వినిపిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ సర్వే నంబర్ 104లో 20 ఏళ్ల కాల పరిమితితో 7.991 హెక్టార్లలో క్వారీ నిర్వహణకు గాను రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ శనివారం ఇచ్చాపురం గిరిజన గ్రామంలో జరిగింది. ఈ క్వారీ లీజును మెస్సర్స్ వీఆర్ ఇన్‌ఫ్రా అండ్ టెక్నాలజీస్ దక్కించుకుంది. ఈ మేరకు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో సుధాసాగర్, ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, పొల్యూషన్ బోర్డు ఈఈ ముకుందరావు పాల్గొన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో 35 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా మిగిలిన వారు వినతులు అందించారు.

గ్రామస్తుల అభ్యంతరం

కుసులవాడ రెవెన్యూ పరిధిలోని చిన్నయ్యపాలెం, ఇచ్చాపురం, రేగానిగూడెం గ్రామాలలోని గిరిజనులు క్వారీ ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్ వలన 35 మీటర్ల లోతుగా తవ్వకాలు జరిగితే పర్యావరణం దెబ్బతింటుందని.. నీరు, పంటలు, జంతుజాలం, పక్షుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కేవలం 19 మందికి మాత్రమే క్వారీలో ఉపాధి కల్పిస్తే చుట్టుపక్కల 5 వేల మంది ప్రజలు కాలుష్య ప్రభావం కారణంగా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎస్ఆర్ నిధులు 2 శాతం ఖర్చు చేసినా కాలుష్య ప్రభావం నుంచి కోలుకోవడం కష్టమన్నారు. బ్లాస్టింగ్ కాకుండా డ్రిల్లింగ్‌తో తవ్వకాలు జరిపితే అభ్యంతరాలు లేవని మిగిలిన గ్రామాల ప్రజలు తెలిపారు. క్వారీకి అనుకూలంగా కొందరు తమను బెదిరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ రెవెన్యూ పరిధిలో ఆక్వా పరిశ్రమల కారణంగా కాలుష్య సమస్య ఏర్పడి 40 వరకు పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. క్వారీతో సంబంధం లేనివారు, ఎప్పుడూ స్థానికుల సమస్యలు పట్టించుకోని నాయకులు మాట్లాడటం సరికాదని విమర్శించారు. క్వారీ చుట్టుపక్కల ప్రాంతాలలో పోలీస్ శాఖకు సంబంధించి ఫైరింగ్ రేంజ్, ఐటీబీపీ, గ్రేహౌండ్స్ విభాగాలు ఉన్నాయన్నారు. స్థానికుల తరపున సీపీఎం నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కె.నాగరాణి తదితరులు మాట్లాడారు.

ఎన్‌జీవోలు, పర్యావరణ వేత్తల సమర్థన

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్‌జీవోలు, పర్యావరణ వేత్తలు మాట్లాడుతూ స్థానికుల అభ్యంతరాలను సమర్థిస్తూనే దేశాభివృద్ధికి క్వారీలు అవసరమన్నారు. రహదారుల నిర్మాణంలో గ్రావెల్, భవనాల నిర్మాణంలో రఫ్‌స్టోన్, క్వార్జ్ అవసరమన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

అధికారులు మాట్లాడుతూ సభలో స్థానికుల మాటలు, వినతులను మినిట్స్‌లో పొందుపరిచి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. క్వారీ నిర్వాహకులు మాట్లాడుతూ ఎకో ఫ్రెండ్లీ పద్ధతిలో డ్రిల్లింగ్ చేస్తూ స్థానికులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మధురవాడ: పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు గాయపడ్డారు. ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద చెత్త దుకాణంలో పని చేస్తున్న కోటిపల్లి సంజీవరావు (63) ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో బండిపై రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి ఆ వాహనాన్ని ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో సంజీవరావుకు ఎడమ కాలిపై గాయమైంది. అయితే, ఎవరికీ చెప్పకుండా దుకాణం వద్దనే ఉండిపోయారు. 27వ తేదీన నొప్పి ఎక్కువ కావడంతో కేజీహెచ్‌లో చేరారు. శనివారం పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి సౌజన్య

తగరపువలస: మహిళలపై జరుగుతున్న హింస నుంచి కాపాడేందుకు అనేక చట్టాలు ఉన్నాయని భీమిలి అదనపు 15వ మెట్రోపాలిటన్ న్యాయ స్థానం న్యాయమూర్తి డి.సౌజన్య తెలిపారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆనందపురం ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం మహిళా చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉచిత న్యాయ సలహాలు అందించే అధికారులు ఉన్నారన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయదేవి మాట్లాడుతూ మహిళల రక్షణకు సంరక్షణ గృహాలు, స్వధార్ హోమ్స్, కేజీహెచ్ వద్ద వన్ స్టాప్ సెంటర్ ఉన్నాయని తెలిపారు. న్యాయవాదులు స్వర్ణగౌరి, రవిశంకర్ మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ ప్రణాళిక ప్రకారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

భీమిలిలో..

భీమునిపట్నం: ప్రతి మహిళకు చట్టాలపై తగిన మేరకు అవగాహన అవసరమని భీమిలి అదనపు 15వ మెట్రోపాలిటన్ న్యాయస్థానం న్యాయమూర్తి డి.సౌజన్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింసకు సంబంధించిన సమస్యలుంటే న్యాయస్థానాల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి, ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవి, ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దారు రామారావు, న్యాయవాదులు స్వర్ణగౌరి, రవిశంకర్ పాల్గొన్నారు.

రేవిడి రెవెన్యూ సదస్సులో 44 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 44 దరఖాస్తులు వచ్చాయి. మ్యుటేషన్ కోసం 13 మంది, సర్వేకు 13 మంది, 22ఏ కు ఇద్దరు, కులం సర్టిఫికెట్లకు 16 మంది దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కె.ఆనందరావు ఈ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో ఇంటిని విక్రయిస్తున్నారని ఫిర్యాదు

తగరపువలస: తమ ఇంటిని తప్పుడు పత్రాలతో విక్రయించేందుకు మనుమడు ప్రయత్నిస్తున్నాడని ఓ వృద్ధురాలు భీమిలి పోలీసులను ఆశ్రయించారు. వివరాలివి.. జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటకు చెందిన ఊళ్ల నరసయ్యమ్మ (80)కు సర్వే నంబర్ 69/4లో భర్త నరసింహులు నిర్మించిన పెంకుటిల్లు ఉంది. భర్త మరణించడంతో పెంకుటింట్లో ఒంటరిగా నివసిస్తూ, ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్‌తో కాలం వెళ్లదీస్తోంది. ఆమె ముగ్గురు కుమారులు వేర్వేరుగా ఇళ్లు నిర్మించుకుని, వారి కుటుంబాలతో ఉంటున్నారు. ఇటీవల నరసయ్యమ్మ మనుమడు వెంకట్ (పెద్ద కుమారుని కుమారుడు) తప్పుడు పత్రాలతో పెంకుటిల్లును విక్రయానికి పెట్టి, తనను తరిమేయాలని చూస్తున్నాడని వృద్ధురాలు ఆరోపించారు. ఈ ఇల్లు విక్రయిస్తే తనకు నిలువనీడ లేకుండా పోతుందని, తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు.

చిట్టి చేతుల గట్టి సాయం

గాయపడ్డ పేద విద్యార్థికి చికిత్సకు సన్ స్కూల్ విద్యార్థుల వితరణ



చందుకు ఆర్థిక సాయం అందిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: ప్రమాదంలో గాయపడ్డ పేద విద్యార్థి చికిత్స కోసం కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్ విద్యార్థులు ఆర్థికసాయం అందించి, ఔదార్యాన్ని చాటుకున్నారు. బోరపేటకు చెందిన బర్ల చందు ఇంటర్ చదువుతూనే, పేపర్‌బాయ్‌గా కూడా పని చేస్తున్నాడు. ఇటీవల రోడ్డుప్రమాదంలో చందు తలకు తీవ్ర గాయమైంది. చికిత్స, మందుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న విద్యార్థులు రూ.20 వేలు సేకరించారు. స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు సొంతంగా పది వేల రూపాయలు అందించారు. మొత్తం రూ.30 వేలను చందు కు విద్యార్థులు వెళ్లి అందించారు.